సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 5 । మే । 2023



స్త్రీనిధి.. పెన్నిధి

రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల సభ్యులకు స్త్రీనిధి రుణాలు అందిస్తోంది.

8లో ▸




వీడని వాన

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

8లో ▸

బాస్కెట్‌బాల్‌లో హవా



ఏపీ సీఎం కప్ ఆటల పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్ బాల్ మహిళల జట్టు ఫైనల్‌కు చేరుకుంది. తిరుపతి వేంకటేశ్వర వర్సిటీ ప్రాంగణంలో పోటీలు జరుగుతున్నాయి.

8లో

న్యూస్‌రీల్

దాసరి సేవలు ఎనలేనివి



తణుకులో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: కళా, రాజకీయ రంగాల్లో దర్శకరత్న దాసరి నారాయణరావు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వర రావు అన్నారు. తణుకులో దర్శకరత్న దాసరి నారాయణరావు 76వ జయంతి సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దాసరి రచయితగా, దర్శకుడిగా సినీ కళారంగానికి ఎంతో సేవ చేశారని అన్నారు. ఎందరో యువతకు ఉపాధి చూపిన గొప్ప మనిషి దాసరి అన్నారు. వందకు పైగా సినిమాల్లో దర్శకత్వం చేసి గిన్నిస్ బుక్ రికార్డులో స్థానం సంపాదించారని కొనియాడారు. అటువంటి మహనీయుడు మన జిల్లాకు చెందిన వారు కావడం గర్వకారణం కాగా, ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు.

జిల్లా ఎంపీపీల సంఘ అధ్యక్షుడిగా నర్సింహరాజు



నర్సింహరాజును సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: జిల్లా మండలాధ్యక్షుల (ఎంపీపీ) సంఘ అధ్యక్షుడిగా భీమవరం ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భీమవరంలో గురువారం రాష్ట్ర ఎంపీపీల సంఘం కన్వీనర్ మేకల హనుమంతరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా రుద్ర ధనరాజు (తణుకు), ఉపాధ్యక్షురాలిగా సబ్బితి సుమంగళిసాగర్ (పోడూరు), ప్రధాన కార్యదర్శిగా కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు (ఇరగవరం), అధికార ప్రతినిధిగా కర్రి వెంకటనారాయణరెడ్డి, కార్యదర్శులుగా దాసరి హైమావతి (పెంటపాడు), నల్లి జయలక్ష్మి (నరసాపురం), రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఇందుకూరి శ్రీహరినారాయణరాజు (ఉండి) ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రతి ధాన్యం గింజనూ కొంటాం



రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

ఉండి: రైతులెవ్వరూ అధైర్యపడొద్దని, పూర్తిస్థాయిలో ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు మిల్లర్ల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని జాయింట్ కలెక్టర్ రామసుందర్‌రెడ్డి అన్నారు. గురువారం పెదపుల్లేరు రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు వివరాలు తెలుసుకున్నారు. అనంతరం చెరుకువాడలో రైస్‌మిల్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ఇబ్బందులుంటే ఆర్బీకే సిబ్బంది, వ్యవసాయ అధికారులు, తహసీల్దార్‌కు తెలియజేయాలన్నారు. రైతు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొంటుందన్నారు. రైస్‌మిల్లుల నుంచి ఎటువంటి సమస్యలు వచ్చినా వెంటనే పరిష్కరించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ స్వామినాయుడు, మండల వ్యవసాయాధికారి బి.సంధ్య, రైతులు పాల్గొన్నారు.

కల్యాణం.. కడు రమణీయం

అట్టహాసంగా చిన వెంకన్న తిరు కల్యాణోత్సవం



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, ఈఓ త్రినాథరావు



వేదికపై కల్యాణ తంతు జరిపిస్తున్న పండితులు

ద్వారకాతిరుమల: నుదుటున కల్యాణ తిలకం.. బుగ్గన చుక్కతో సిగ్గులొలుకుతున్న పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లను సర్వాభరణ భూషితుడైన శ్రీవారు పెండ్లాడారు. వైశాఖ మాస బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన స్వామివారి కల్యాణోత్సవం ఆలయ అనివేటి మండపంలో గురువారం రాత్రి వైభవంగా జరిగింది. ముందుగా శ్రీవారు, అమ్మవార్లను వేర్వేరు వాహనాలపై కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. రజత సింహాసనంపై కల్యాణమూర్తులను వేంచేపు చేసి శుభముహూర్త సమయంలో కల్యాణ తంతు జరిపించారు. దేవస్థానం తరపున ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఆయన కుమారుడు నివృతరావు పట్టువస్త్రాలను, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, ఈఓ వేండ్ర త్రినాథరావు అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఆద్యంతం కల్యాణ వేడుక అలరించింది. అధిక సంఖ్యలో భక్తులు వేడుకను వీక్షించి తరించారు. ఉదయం సింహ వాహనంపై, రాత్రి కల్యాణం ముగిసిన తర్వాత వెండి గరుడ వాహనంపై తిరువీధి సేవలు అట్టహాసంగా జరిగాయి. అనివేటి మండపంలో స్వామివారు మోహిని అలంకారంలో దర్శనమిచ్చారు. శుక్రవారం రాత్రి 7 గంటల నుంచి శ్రీవారి దివ్య రథోత్సవం ప్రారంభమవుతుంది. మంత్రి కొట్టు దంపతులు ఆలయంలో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు జరిపించారు.

తిన్నింటి వాసాలే లెక్కపెట్టి..

- దేవదాయ ఉద్యోగి అక్రమాల చిట్టా
- ఏసీబీ దాడులతో వెలుగులోకి..
- వాసా నగేష్ అరెస్టుతో ఆలయ ఉద్యోగుల్లో కలకలం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న దేవస్థానంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ పది నెలల క్రితం విజయవాడ దుర్గగుడికి బదిలీ అయిన వాసా నగేష్ అవినీతి చిట్టా ఒక్కొక్కటిగా బయట పడుతోంది. ఏసీబీ దాడులతో ఆశ్చర్యకర విషయాలు వెలుగుచూస్తున్నాయి. నగేష్ 1988 అక్టోబర్‌లో చినవెంకన్న దేవస్థానంలో అటెండర్‌గా ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా పదోన్నతులు పొంది సూపరింటెండెంట్ అయ్యారు. ఇప్పటివరకు ఆయన సర్వీసు అంతా వివాదాల మధ్యే సాగింది.



సర్టిఫికెట్లపైనా అనుమానాలు..

నగేష్ చదువుకు సంబంధించిన సర్టిఫికెట్లపైనా అధికారులకు అనుమానాలున్నాయి. ఇందుకు గతంలో ఇక్కడ ఈఓగా పనిచేసిన ప్రేమ్‌కుమార్ రాసిన లేఖ నిదర్శనంగా చెప్పొచ్చు. ఆర్‌సీ.నెం.బి1/2439/2007 ది.18-8-2008న సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఈఓకు ప్రేమ్‌కుమార్ లేఖ పంపినట్టు తెలుస్తోంది. అప్పట్లో నగేష్ ఆ దేవస్థానంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇన్ని జరిగినా



ద్వారకాతిరుమలలో నగేష్ అపార్ట్‌మెంట్, (అంతరచిత్రం) వాసా నగేష్ (ఫైల్)

ఆయన పదోన్నతులకు ఎక్కడా బ్రేక్ పడలేదు. అలాగే డబ్బు లావాదేవీలు జరిగే కీలక విధుల్లోనే ఆయన కొనసాగారు. ఇవన్నీ అధికారుల అండదండలతోనే జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి.

ఏసీబీ వల : విజయవాడ దుర్గగుడి ఉద్యోగులు కొందరు నగేష్‌పై కన్నేశారు. ఏసీబీ అధికారులకు అందించిన సమాచారంతో వారు నగేష్ ఆస్తులపై ఈనెల 3, 4 తేదీల్లో మెరుపుదాడులు చేసి అక్రమ ఆస్తులను గుర్తించారు.

కమిషనర్ కార్యాలయం కేంద్రంగా..

నగేష్ దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయాన్ని కేంద్రంగా చేసుకుని తన హవాను కొనసాగించినట్టు తెలుస్తోంది. అక్కడ కొందరు అధికారులు, సిబ్బంది సహకారంతో తనకు నచ్చినట్టుగా ఆర్డర్లు తెచ్చేవాడని అంటున్నారు.

అక్రమార్కులకు హడల్

ఏసీబీ అధికారులు నగేష్‌ను గురువారం అరెస్టు చేయడంతో ఆలయ వర్గాల్లో కలకలం రేగింది. ఆలయాల్లో పనిచేసే ఉద్యోగి ఆస్తులపై ఏసీబీ అధికారులు దాడులు చేయడం ఇదే ప్రథమం. దీంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

అడుగడుగునా అక్రమాలే..

- 1997-98 మధ్య శ్రీవారి దేవస్థానంలో దొంగ టికెట్లు ముద్రించిన ఉద్యోగుల్లో నగేష్ పాత్ర ఉన్నట్టు అప్పటి అధికారులు గుర్తించారు. దాంతో నగేష్‌ను డబ్బు లావాదేవీలు జరిగే కీలక విధుల్లో నియమించకూడదని ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే విషయాన్ని అధికారులు అతని సర్వీసు రిజిష్టర్‌లో కూడా నమోదు చేశారు.
- ఆ తర్వాత కేశఖండనశాలలో వినియోగించే బ్లేడుల కొనుగోలులో స్కామ్‌కు పాల్పడినట్టు అధికారులు గుర్తించారు. పావలా బ్లేడును.. రూపాయి పావలాకు కొనుగోలు చేసినట్టు బిల్లులు పెట్టి, సొమ్మును స్వాహా చేసినట్టు తెలుసుకున్నారు. దీనికి సంబంధించి 2004లో నగేష్ నుంచి కొంత నగదును అప్పటి అధికారులు రికవరీ చేశారు.
- తాజాగా జరిగిన జీఎస్టీ స్కామ్‌లో నగేష్ పాత్ర ఉన్నట్టు గుర్తించిన ప్రస్తుత ఈఓ వేండ్ర త్రినాథరావు ఆయన జీతం నుంచి నగదును రికవరీ చేశారు. అయితే ఈ విషయాలు మాత్రమే అధికారికంగా ఎస్ఆర్‌లో నమోదైనట్టు తెలుస్తోంది.
- ఇవి కాకుండా గత టోల్‌గేటు లీజు విషయంలో సంబంధిత కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరేలా చేసి పెద్ద మొత్తంలో సొమ్ము దిగమింగాడన్న ఆరోపణలు ఉన్నాయి.
- ఆగమ పాఠశాల, స్థానిక సంస్కృతోన్నత పాఠశాల, భీమడోలు, కామవరపుకోట దేవస్థానం కళాశాలల్లోని ఉద్యోగుల నియామకాలు, పదోన్నతుల్లో ఈయన కీలక పాత్ర పోషించినట్టు చెబుతున్నారు.
- కాంట్రాక్టర్లు, వ్యాపారులకు కొమ్ముకాస్తూ.. తనకు నచ్చిన వారికి లబ్ధి చేకూర్చేలా చేసేవాడనే ఆరోపణలు ఉన్నాయి.

ధాన్యం కొనుగోళ్లు వేగిరపర్చాలి



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

గణపవరం: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, రైతుల ఇబ్బందుల దృష్ట్యా ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని, అధికారులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం ఆమె మొయ్యేరు ఆర్బీకేను పరిశీలించి ధాన్యం కొనుగోలు తీరుతెన్నులను పరిశీలించారు. రైసుమిల్లుల నుంచి సమస్య ఎదురైనా వెంటనే చర్యలు తీసుకోవాలని, రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని తహసీల్దార్ పమ్మి లక్ష్మిని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే రైసుమిల్లులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే మిల్లును సీజ్ చేయాలని ఆదేశించారు. ఎక్కడా ధాన్యం కొనుగోలులో అంతరాయం ఉండకూడదన్నారు. రైతులు ఎవ్వరూ మిల్లుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని, సమస్యలుంటే రైతు భరోసా కేంద్రం అధికారి, తహసీల్దార్, వ్యవసాయాధికారి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ధాన్యం రవాణాకు గోనె సంచులు, లారీలు అందుబాటులో ఉంచామన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బీచ్‌ల అభివృద్ధికి కృషి

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చీఫ్‌విప్ ముదునూరి

మొగల్తూరు: జిల్లాలోని కేపీపాలెం, పేరుపాలెం బీచ్‌లను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గురువారం కేపీ పాలెం బీచ్‌లో రూ.కోటి వ్యయంతో చేపట్టిన దివంగత వైఎస్సార్ కాంస్య విగ్రహం, మ్యూజియం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీర ప్రాంత ప్రజల గుండెల్లో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. బీచ్‌ల రహదారులు ఆయన హయాంలోనే అభివృద్ధి చెందాయని గుర్తుచేశారు. బీచ్‌ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని, మరోసారి బీచ్ ఫెస్టివల్ నిర్వహించేందుకు సీఎం జగన్ సానుకూలంగా ఉన్నారన్నారు. బీచ్‌లో పటిష్ట సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. నిర్మాణ పనులు 60 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. జెడ్పీటీసీ తిరుమాని బాపూజీ, ఎంపీటీసీ సభ్యులు అందే ముక్తేశ్వర రావు, డీవీవీ సత్యనారాయణ, కార్పొరేషన్ డైరెక్టర్ బందన పూర్ణచంద్రరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ కటికల సూర్యారావు, నాయకులు పాల్గొన్నారు.

239 మంది పశు వైద్య సహాయకుల నియామకం

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్బీకే) 239 మంది పశు వైద్య సహాయకులను శాశ్వత ప్రాతిపదికన నియమించామని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.నెహ్రూబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మిగిలిన 298 రైతు భరోసా కేంద్రాల్లో గోపాలమిత్రలు, పారా వెటర్నరియన్లను త్వరలో నియమిస్తామని పేర్కొన్నారు. ఆర్బీకే సిబ్బంది హాజరు నమోదును ప్రతిరోజూ పర్యవేక్షిస్తామని, పశువైద్య సేవలనూ ఆర్బీకేల ద్వారా అందిస్తున్నామని తెలిపారు. పశువులకు టీకాలు వేయడం, చికిత్స అందించటం, కృత్రిమ గర్భధారణ వంటి సేవలను అందిస్తున్నామని, మందులను అందుబాటులో ఉంచామని తెలిపారు. 2,612.60 టన్నుల సమీకృత దాణా, 165.10 టన్నుల విత్తనం, 77 చాఫ్ కట్టర్‌లు, మినరల్ మిక్చర్స్, సప్లిమెంట్స్ సరఫరా చేసినట్లు పేర్కొన్నారు.

చేసిన మంచిని చెబుదాం.. ప్రజాశీస్సులు కోరదాం

- వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి
- ఉండి నియోజకవర్గ సమావేశంలో సూచన



నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ బోస్, మంత్రి కారుమూరి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీరంగనాథరాజు, ఎమ్మెల్యే గ్రంధి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఉండి: రాబోయే ఎన్నికల్లో ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచి వివరిస్తూ వారి ఆశీస్సులు కోరదామని వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో ఉండి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో గురువారం భీమవరం యూత్ క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. నియోకవర్గంలో పార్టీ విజయానికి కావాల్సిన సూచనలు సలహాలను స్వీకరించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఆచంట ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, నియోజకవర్గ పరిశీలకుడు రౌతు సూర్యప్రకాశరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మిథున్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమ పాలన దెబ్బకు చంద్రబాబు కుప్పంలో కుప్పకూలిపోయాడన్నారు. రాష్ట్రంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని అందిస్తున్నారని దీంతో కుప్పం నియోజకవర్గంలో గతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయం సాధించిందన్నారు. చంద్రబాబు, లోకేష్ కుప్పంలో విస్తృతంగా తిరిగినా 25 స్థానాలకు 19 స్థానాలను వైఎస్సార్ సీపీ గెలిచిందన్నారు. మిగిలిన స్థానాల్లోనూ స్వల్ప తేడాతో ఓడామన్నారు. జాతీయ మీడియా సర్వేలన్నీ వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్నాయని, రాష్ట్రంలోని 24 ఎంపీ స్థానాలతో పాటు ఎమ్మెల్యేలను క్లీన్‌స్వీప్ చేయబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. అందుకే ప్రతిపక్షాలకు చెందిన వారు కూడా జగనన్నకు ఓట్లు వేసేందుకు ఎదురు చూస్తున్నారన్నారు.

ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పేలా..

రాజ్యసభ సభ్యుడు సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ మానసికంగా దెబ్బతీయాలనే ఎత్తుగడలతో ప్రతిపక్షాలు ముందుకు సాగుతున్నాయని, వారికి బుద్ధి చెప్పేలా ఉండిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులంతా ప్రజలతో మమేకమై ఉండాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మరింత అవగాహన కల్పించాలన్నారు.

సర్వేలన్నీ మనకే అనుకూలం

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టేందుకు చంద్రబాబు కుతంత్రాలు పన్నుతున్నారని, అన్ని సర్వేలు వైఎస్సార్ సీపీకే అనుకూలంగా ఉన్నాయన్నారు. 175కి 175 సీట్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు పాలనలో టీడీపీ వారికే పథకాలు అందాయని, అయితే సీఎం జగన్ పార్టీలు, ప్రాంతాలు, కులాలు, మతాలు చూడకుండా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నారన్నారు. దీంతో టీడీపీకి చెందిన వారు కూడా పథకాలు పొందుతున్నారని, వారంతా జగన్ పాలనే కోరుకుంటున్నారని అన్నారు. పార్టీ నాయకులు పాతపాటి శ్రీనివాసరాజు (వాసు), గూడూరి ఉమాబాల, రాష్ట్ర డైరెక్టర్లు మంతెన యోగేంద్రకుమార్ (బాబు), గులిపల్లి అచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఫ్లాప్ షో

- అన్నదాతలకు దూరంగా రైతు పరామర్శ
- బాబు పర్యటనకు రైతులు కరువు
- కేడర్‌ను కూడా పట్టించుకోని చంద్రబాబు పర్యటన

సాక్షి ప్రతినిధి,ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ధాన్యం పూర్తిగా తడిసిన రైతుల వద్దకు వెళ్లి ప్రతి ఒక్కరితో మాట్లాడి ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోయాలన్న చంద్రబాబు స్క్రీన్‌ప్లే బెడిసి కొట్టింది. ప్రతి గ్రామంలో వందల మంది రైతులున్నా పట్టుమని పది మంది కూడా బాబు పర్యటనకు రాకపోవడంతో పర్యటన జిల్లాలో ఫ్లాప్‌షోగా మారింది. ఉమ్మడి జిల్లాలోని మూడు ప్రాంతాల్లో రైతులతో మాట్లాడేలా చంద్రబాబు పర్యటన రూపొందించారు. అయితే పర్యటన ఆద్యంతం నామమాత్రపు సంఖ్యలో పార్టీ కార్యకర్తలు మినహా జనాలు, రైతులు ముఖం చాటేయడం గమనార్హం.

పర్యటన అట్టర్‌ఫ్లాప్

ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు మండలం ఉంగుటూరు, నాచుగుంట, పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం మండలం నందమూరు, తణుకు మండలంలోని దువ్వలో ఎంపిక చేసిన రైతులతో చంద్రబాబు మాట్లాడేలా తెలుగుదేశం పార్టీ ఒక రోజు పర్యటనను ఖరారు చేసింది. దీని కోసం ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల ఇన్‌చార్జులకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చి వేల సంఖ్యలో పార్టీ కేడర్‌ను, వందల సంఖ్యలో రైతులను తీసుకురావాలని, ప్రతి చోటా చంద్రబాబుకు ఘనస్వాగతం పలకాలని, ప్రతి గ్రామంలో తడిసిన ధాన్యం బస్తాలోనే నేరుగా ఆయన వద్దకు తెచ్చి చూపించి రైతులు ఆవేశంగా మాట్లాడాలని ముందస్తుగా చెప్పారు. దీంతో పాటు చంద్రబాబు నేరుగా పొలాల్లోకి, ధాన్యం కల్లాల్లోకి వచ్చి చూసి మాట్లాడతారని ప్రత్యేకంగా నియోజకవర్గ నేతలు ఏర్పాట్లుచేశారు. అయితే పార్టీ కేడర్ చాలా లైట్‌గా తీసుకుంది. పర్యవసానంగా చంద్రబాబు పర్యటన అట్టర్‌ఫ్లాప్ అయ్యింది.

రెండు గంటల ఆలస్యంగా..

నిర్ణీత షెడ్యూల్ కంటే రెండు గంటలు ఆలస్యంగా జిల్లాకు చేరుకున్న చంద్రబాబు పర్యటనలో కేడర్ పెద్దగా కనిపించలేదు. నాచుగుంటలో ఆరుగురు రైతులను ఎంపిక చేసి చంద్రబాబు రకరకాలుగా ప్రశ్నలు అడిగినా ఎవరూ పెద్దగా స్పందించలేదు. ఒకరిద్దరూ మాత్రమే వారికి కావాల్సిన రీతిలో మాట్లాడారు. మరోవైపు నాచుగుంటలో జనం లేకపోవడంతో పర్యటన వెలవెలబోయింది. వాస్తవానికి నాచుగుంటలో 45,170 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. 15 రోజుల వ్యవధిలోనే 30,876.4 క్వింటాళ్ల కొనుగోలు పూర్తయ్యాయి. ఇంకా 14,293 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉంది. నాలుగు రోజుల నుంచి వర్షాల కారణంగా ఆలస్యమైంది. మరో వారం వ్యవధిలో ఇవి పూర్తవుతాయి. తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని ప్రభుత్వం, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు బుధవారం ప్రకటించడంతో చంద్రబాబు నాచుగుంటలో హడావుడి చేయాలని చూసినా వర్క్‌వుట్ కాలేదు.



నాచుగుంటలో వెలవెలబోయిన చంద్రబాబు పర్యటన

నందమూరులో..

నందమూరులోనూ ఇదే పరిస్థితి. మొత్తం మీద కార్యకర్తలతో కలిపి పదుల సంఖ్యలోనే జనాలు ఉన్నారు. ఎంపిక చేసిన ముగ్గురు రైతుల్లో ఇద్దరు స్థానికులు కాగా, ఒకరు తణుకుకు చెందిన వ్యక్తి. వీరితో మాట్లాడి, ప్రభుత్వాన్ని విమర్శించి అక్కడ నుంచి తణుకు మండలం దువ్వ చేరుకున్నారు. అక్కడ ఎంపిక చేసిన పది మంది రైతులతో సమస్యలు చెప్పించి, అనంతరం విలేకరుల సమావేశంలో సుదీర్ఘంగా ప్రసంగించారు. చంద్రబాబుతో పాటు ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, పార్టీ నాయకులు గన్ని వీరాంజనేయులు, చింతమనేని ప్రభాకర్, శివరామరాజు, పీతల సుజాత, తోట సీతారామలక్ష్మి, వలవల బాబ్జి ఉన్నారు.

క్లుప్తంగా

క్రీడా శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



ఏలూరు రూరల్: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చేపట్టిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సెట్‌వెల్ సీసీఓ ఎండీహెచ్ మెహర్రాజ్ అన్నారు. గురువారం ఏలూరు బిశ్వనాథ్‌భర్తియా స్విమ్మింగ్‌పూల్ వద్ద శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్విమ్మింగ్ సాధన వల్ల బాలబాలికలు మరింత ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. వేసవికాలంలో స్విమ్మింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని పిల్లలను శిక్షణకు తీసుకురావాలని సూచించారు.

8న ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కేంద్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామికీకరణ మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ ఆఫ్ జనరల్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 8న అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ఏలూరు ప్రభుత్వ ఐటీఐ ప్రధానాధికారి పీ.రజిత ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సత్రంపాడు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఈ అప్రెంటిస్‌షిప్ మేళా ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ మేళాలో నెల్లూరుకు చెందిన గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, తిరుపతి వీల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, చిత్తూరు అమరరాజా గ్రూప్ ప్రైవేట్ లిమిటెడ్, విజయవాడ నవత రోడ్ ట్రాన్స్‌పోర్టు, నూజివీడు మోహన్ స్పిన్‌టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థలు హాజరవుతాయన్నారు. మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఎస్‌ఎస్‌సీ మార్కుల మెమో, ఐటీఐ మార్కుల మెమో, గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ ఫొటోలతో రావాలన్నారు. ఇతర వివరాలకు 08812 230269 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

స్త్రీనిధి.. మహిళల పెన్నిధి

- మహిళల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం చర్యలు
- స్వయం ఉపాధికి ఊతం ఇస్తున్న స్త్రీనిధి రుణాలు
- నాలుగేళ్లలో ఉమ్మడి జిల్లాలో రూ.764 కోట్ల రుణాలు
- వ్యాపారాల్లో రాణిస్తున్న సాధారణ మహిళలు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో మహిళల ఆర్థిక పరిపుష్టికి, సాధికారతకు ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల నుంచి అన్ని వర్గాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పలు పథకాలు ప్రవేశపెట్టింది. బ్యాంకుల ద్వారా డ్వాక్రా సంఘాలకు పెద్ద ఎత్తున రుణాలు అందిస్తున్న ప్రభుత్వం.. స్త్రీనిధి ద్వారా మహిళలు వ్యాపారాలు చేసుకునేందుకు మరింత ఆర్థిక సహకారాన్ని అందిస్తోంది. దీంతో కూలి పనులు చేసుకునే మహిళలు సైతం చిరు వ్యాపారాలు ప్రారంభించి తమ కుటుంబాలకు చేదోడుగా నిలుస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మహిళలు తమ కాళ్లపై తాము నిలబడుతూ జీవనోపాధిని మెరుగుపరుచుకుంటున్నారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఇతర అవసరాల కోసం ఒకరి దగ్గర చేయి చాచకుండా తామే బతక గలుగుతున్నామనే ఆత్మవిశ్వాసం మహిళల్లో కన్పిస్తోంది. ఆర్థికంగా శక్తివంతులను చేసే విధంగా ప్రభుత్వం సహకారం అందజేయడంతో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలలోని మహిళలు సంతోషాలను వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వల్లే సాధ్యమైందంటున్నారు మహిళలు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు జిల్లాలో గత నాలుగేళ్లలో స్త్రీనిధి ద్వారా మొత్తం రూ.384.02 కోట్లు రుణాలుగా అందించారు. దీనిలో 2019–20 ఆర్థిక సంవత్సరంలో 3,586 గ్రూపులకు చెందిన 11,290 మందికి రూ.55.85 కోట్లు, 2020–21లో 3,734 గ్రూపులకు చెందిన 13,712 మందికి రూ.69.30 కోట్లు, 2021–22లో 9,609 గ్రూపులకు చెందిన 31,951 మందికి రూ.116.24 కోట్లు, 2022–23లో 8,263 గ్రూపులకు చెందిన 30,364 మంది మహిళలకు రూ.142.63 కోట్లు రుణాలుగా ఇచ్చారు.

పశ్చిమగోదావరి జిల్లాలో..

పశ్చిమగోదావరి జిల్లాలో నాలుగేళ్లలో మొత్తం రూ.380.17 కోట్లు స్త్రీనిధి రుణాలు అందించారు. వీటిలో 2019–20లో 4,348 గ్రూపులకు చెందిన 14,131 మందికి రూ.70.16 కోట్లు, 2020–21లో 4,403 గ్రూపులకు చెందిన 15,411 మందికి రూ.77.69 కోట్లు, 2021–22లో 8,596 గ్రూపులకు చెందిన 29,691 మందికి రూ.105.97 కోట్లు, 2022–23 ఆర్థిక సంవత్సరంలో 7,522 గ్రూపులకు చెందిన 27,475 మందికి రూ.126.35 కోట్లు స్త్రీనిధి రుణాలుగా అందించారు.



నాలుగేళ్లలో స్త్రీనిధి ద్వారా అందించిన రుణాలు, సభ్యుల వివరాలు

జిల్లా పేరు	డ్వాక్రా గ్రూపులు	తీసుకున్న సభ్యులు	రుణం
ఏలూరు	25,192	87,317	రూ.384.02 కోట్లు
పశ్చిమగోదావరి	24,869	86,708	రూ.380.17 కోట్లు
మొత్తం	50,061	1,74,025	రూ.764.19 కోట్లు

మహిళల ఆర్థికాభివృద్ధికి ఊతం



మహిళల ఆర్థికాభివృద్ధికి ఊతం ఇచ్చే విధంగా స్త్రీ నిధి రుణాలు దోహదపడుతున్నాయి. ప్రభుత్వం అందజేస్తున్న ఆసరా, చేయూత పథకాలతో పాటు డ్వాక్రా సంఘాలకు బ్యాంకు లింకేజ్ రుణాలకు అదనంగా స్త్రీ నిధి రుణాలను అందజేస్తున్నాం. దీంతో మహిళలు వ్యాపారాలను ప్రారంభిస్తూ స్వయం సమృద్ధి సాధిస్తున్నారు. తమ కాళ్లపై తాము నిలబడగలుగుతున్నారు.

– పి.శశికుమార్, ఏజీఎం, స్త్రీనిధి, ఏలూరు

మహిళా సాధికారతకు దోహదం



మహిళా సాధికారతకు స్త్రీనిధి రుణాలు దోహదం చేస్తున్నాయి. స్వయం సహాయక సంఘాల సభ్యులకు స్త్రీనిధి సంస్థ స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పొందేందుకు అవకాశం కల్పిస్తోంది. వ్యాపారంపై పూర్తి అవగాహనతో నిర్దిష్ట ప్రణాళికతో వస్తే అనుగుణంగా నిధులు కేటాయిస్తున్నాం. మహిళలు స్త్రీనిధి రుణాలను అందిపుచ్చుకోవడం ద్వారా ఆర్థిక పరిపుష్టి సాధించాలి.

– ఆర్ విజయరాజు, పీడీ, డిఆర్‌డీఏ, ఏలూరు

ఏటా లక్ష్యానికి మించి రుణాలు



ప్రతి సంవత్సరం జిల్లాలో నిర్దేశించుకున్న లక్ష్యానికి మించి మహిళలు వ్యాపారం చేసుకునేందుకు రుణాలు అందజేస్తున్నాం. జిల్లాలోని మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలి. రుణాలు తిరిగి చెల్లించడంలోనూ మహిళలు చొరవ చూపడంతో మరింత మందికి స్త్రీనిధి రుణాలు అధికంగా ఇవ్వగలుగుతున్నాం.

– ఎంఎస్ఎస్ వేణుగోపాల్,పీడీ,డిఆర్‌డీఏ,భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా

కిరాణా దుకాణం ప్రారంభించా



నేను, నా భర్త కూలీ పనులు చేసుకుని జీవించే వాళ్లం. డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం ఇస్తున్న రుణంతో పాటు స్త్రీనిధి ద్వారా రూ.50 వేలు రుణం తీసుకుని కిరాణా దుకాణం పెట్టుకున్నా. వచ్చిన ఆదాయాన్ని కుటుంబ అవసరాలకు, పిల్లల చదువులకు వినియోగిస్తున్నా. ప్రభుత్వానికి, వ్యాపారానికి రుణ సహాయం అందించిన స్త్రీనిధి అధికారులకు ధన్యవాదాలు.

– బందారు నాగమణి, వాలమర్రు, పాలకొల్లు మండలం, పశ్చిమగోదావరి జిల్లా

దుస్తుల వ్యాపారం ప్రారంభించా



గృహిణిగా ఉన్న నేను ప్రభుత్వ సహకారం, తోడ్పాటు వల్ల మా గ్రామంలోనే దుస్తుల వ్యాపారం ప్రారంభించా. స్త్రీనిధి రుణం కొరకు దరఖాస్తు చేసిన 48 గంటల్లోనే రుణం అందించారు. మేమూ స్వయం శక్తితో బతకగలమనే ధీమా, విశ్వాసాన్ని ప్రభుత్వం కల్పించింది. ఇప్పుడు ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. ఇదంతా సీఎం వైఎస్ జగన్ అందించిన సహకారమే.

– తుమ్మలపల్లి గీత, పోడూరు, పశ్చిమగోదావరి జిల్లా

పచ్చళ్ల తయారీ చేపట్టా.. బాగుంది



ఒకప్పుడు కూలికెళితే గానీ కుటుంబం గడవని పరిస్థితి. బ్యాంకు రుణానికి తోడు స్త్రీనిధి ద్వారా అందించిన ఆర్థిక తోడ్పాటుతో సొంతంగా పచ్చళ్ల తయారీ చేపట్టి మార్కెట్‌లో విక్రయిస్తున్నాం. లాభాలు బాగున్నాయి. కుటుంబ అవసరాలు తీరడమే కాక పిల్లలనూ చదివించుకుంటున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అంటేనే ఒక భరోసా.

– చక్రపు కృష్ణవేణి, లింగగూడెం, చింతలపూడి మండలం, ఏలూరు జిల్లా

బాస్కెట్‌బాల్ పోటీల్లో సత్తా

ఏలూరు రూరల్: ఏపీ సీఎం కప్ ఆటల పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ మహిళల జట్టు ఫైనల్‌కు చేరింది. ఈ నెల 1 నుంచి 5 వరకూ తిరుపతి శ్రీవెంకటేశ్వర యూనివర్శిటీ క్రీడా మైదానంలో పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పురుషుల, మహిళల జట్లు సత్తా చాటాయి. మహిళల విభాగంలో జిల్లా జట్టు నెల్లూరు జట్టుపై 56–12, కర్నూల్ జట్టుపై 69–26 స్కోర్ తేడాతో విజయం సాధించింది. క్వార్టర్‌ఫైనల్‌లో కృష్ణా జట్టును, సెమీఫైనల్‌లో గుంటూరు జట్టును ఓడించి తుది అంకానికి చేరింది. గురువారం రాత్రి ఫైనల్ పోటీ జరగనుంది. మరోపక్క పురుషుల జట్టు కడప, చిత్తూరును ఓడించింది. క్వార్టర్‌ఫైనల్‌లో కర్నూల్‌ను 61–41 స్కోర్‌తో ఓడించి వరుస విజయాలు సాధించింది. గురువారం ఉదయం జరిగిన సెమీఫైనల్‌లో అనంతపురం జట్టు చేతిలో ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది.

యువకుడి అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రొయ్యల చెరువు వద్ద యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం దొంగపిండిలో బస్వాని వెంకట నాగబాబు రొయ్యల చెరువు వద్ద అస్సాం రాష్ట్రంకు చెందిన బహదూర్ నికోలా (24) పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు బహదూర్ నికోలా ఆవును తోలటానికి వెళ్లి తిరిగి రాకపోవడంతో వెతకగా గట్టుపై సొమ్మసిల్లి పడిపోవడంతో వెంటనే భీమవరంలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బహదూర్ నికోలా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయన బంధువు బహదూర్ ఖర్కి ఫిర్యాదు మేరకు ఎస్సై మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జెడ్పీ ఉద్యోగులకు పదోన్నతి బదిలీలు



పదోన్నతులు, బదిలీల ఉత్తర్వులు అందజేస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: జిల్లా పరిషత్ అధీనంలో పనిచేస్తున్న పలువురు జూనియర్, సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పిస్తూ జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ గురువారం పాలకొల్లులో ఉత్తర్వులు అందజేశారు. జిల్లా పరిషత్ కార్యాలయం ఏలూరులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.అనంతకుమార్‌ను అదే కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పీవీ సత్యనారాయణకు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ భీమవరానికి బదిలీ చేశారు. తిరుమలపాలెం జెడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న జి.నాగశ్రీనివాస్‌కు ఏలూరు జెడ్పీ హైస్కూల్‌కు బదిలీ చేశారు. అలాగే పలువురికి పదోన్నతుల ఉత్తర్వులు అందజేశారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: విద్యార్థి అదృశ్యంపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడానికి చెందిన దేవరపల్లి ప్రసాద్ కుమారుడు ఫణిసాయి జంగారెడ్డిగూడెం విద్యావికాస్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడన్నారు. ఇటీవల పరీక్షా ఫలితాల్లో విద్యార్థి ఫెయిల్ కావడంతో, సప్లిమెంటరీ రాసే నిమిత్తం కళాశాల హాస్టల్‌లో ఫణిసాయిని తల్లిదండ్రులు ఈ నెల 2న చేర్పించారు. ఫణిసాయి 3వ తేదీ రాత్రి కళాశాల యాజమాన్యానికి తెలియకుండా బయటకు వెళ్లిపోయాడని, ఈ విషయాన్ని 4వ తేదీ గురువారం ఉదయం తల్లితండ్రులకు కళాశాల యాజమాన్యం తెలియజేసిందన్నారు. తండ్రి ప్రసాద్ కళాశాలలో, ఫణిసాయి స్నేహితులను విచారించిన ఫలితం లేకపోవడంతో, ఆచూకీ కోసం తండ్రి ఫిర్యాదు చేశాడన్నారు.

మద్యం మత్తులో చేయి కోసుకుని..

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన వ్యక్తి మద్యానికి బానిసై మత్తులో చేతినరాలు కోసుకుని మృతిచెందాడు. ఏలూరు మరదాని రంగారావు కాలనీకి చెందిన షేక్ రజాక్ (32) ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. రజాక్‌కు భార్య, పిల్లలు ఉన్నారు. ఇటీవల మద్యానికి బానిసగా మారిపోయాడు. మద్యం మత్తులో తన ఎడమ చేతిని కోసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. అతని ఆరోగ్యస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం గురువారం రాత్రి విజయవాడ తరలిస్తుండగా మధ్యలో మృతిచెందాడు.

మృతుడి గుర్తింపు

రైలు పట్టాలు దాటుతూ రైలు ఢీకొని మృతిచెందిన వృద్ధుడి ఆచూకీ లభించింది. అతని బంధువులు గురువారం హాస్పిటల్‌కు వెళ్ళి గుర్తించారు. భీమడోలు మండలం లక్ష్మీపురానికి చెందిన ఇందుకూరి త్రిమూర్తులు (60) గత రెండు నెలలుగా మానసిక స్థితి సరిగా లేకపోవటంతో ఈనెల 1న ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. సీతంపేట రైల్వేగేటు సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనటంతో మృతిచెందాడు.

శ్రీవారి కొండపై గుర్తు తెలియని వ్యక్తి మృతి

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన సెంట్రల్ పార్కింగ్ వద్ద ఒక గుర్తు తెలియని వ్యక్తి గురువారం సాయంత్రం మృతి చెందాడు. సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగిన ఈ వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 94407 96653 నెంబర్‌కు తెలపాలని ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ కోరారు.

సూడాన్ నుంచి సురక్షితంగా..

స్వగ్రామానికి చేరుకున్న వెంకటరమణ



సూడాన్ నుంచి క్షేమంగా పోడూరులో ఇంటికి చేరుకున్న బొక్కా వెంకటరమణ

పోడూరు: పోడూరు గ్రామానికి చెందిన బొక్కా వెంకటరమణ ఉపాధి నిమిత్తం కొంతకాలంగా సూడాన్ దేశంలో ఉంటుంది. అక్కడ అంతర్యుద్ధం వల్ల నెలకొన్న భయంకరమైన పరిస్థితుల నేపథ్యంలో ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ గడిపింది. సూడాన్‌లో చిక్కుకున్న భారతీయులను సురక్షితంగా స్వదేశానికి రప్పించేందుకు కేంద్రప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కొద్దిరోజులుగా చర్యలు చేపట్టింది. సూడాన్ బాధితుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానంలో గురువారం తెల్లవారుజామున వెంకటరమణ చెన్నై చేరుకుంది. చెన్నై నుంచి ఉదయం 9.30 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి ఉదయం చేరుకుంది. ఆమె వస్తున్న సమాచారాన్ని ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి తెలియజేయడంతో వెంకటరమణను సురక్షితంగా స్వగ్రామానికి చేర్చేలా స్థానిక అధికారులను జిల్లా కలెక్టర్ అప్రమత్తం చేశారు. దీంతో పోడూరు మండలం జగన్నాథపురం వీఆర్‌ఓ ఆర్.స్వామి వెంకటరమణను గన్నవరం నుంచి స్వగ్రామమైన పోడూరుకు తీసుకొచ్చారు. ఆమెను పోడూరు పీహెచ్‌సీకి తీసుకెళ్లి కోవిడ్ పరీక్షలు నిర్వహించగా నెగిటివ్ వచ్చింది. దీంతో ఆమెను ఇంటికి తీసుకెళ్లి కుటుంబసభ్యులకు అప్పగించారు. వెంకటరమణ సురక్షితంగా ఇంటికి చేరుకోవడంతో ఆమె భర్త సూర్యనారాయణ, కుమారులు సంతోషం వ్యక్తం చేశారు.

బిక్కుబిక్కుమంటూ గడిపా

వెంకటరమణ మాట్లాడుతూ ఉపాధి నిమిత్తం గత 15ఏళ్లుగా సూడాన్‌లో ఒక ఇంట్లో పని చేస్తున్నానని చెప్పారు. తాము ఉంటున్న ప్రాంతం కూడా కాల్పులమోతతో అట్టుడికిపోయేదని..ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ కాలం గడిపానన్నారు. ఎట్టకేలకు అక్కడి అధికారుల ద్వారా సూడాన్‌లో ఇండియన్ ఎంబసీ కార్యాలయానికి చేరుకుని భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం చొరవతో క్షేమంగా చేరుకోగలిగానన్నారు.

వీడని వర్షం

- అకాల వర్షాలతో రైతులకు ఇబ్బందులు
- ధాన్యం సేకరణలో అధికారులు



వీరవాసరం మండలంలో ధాన్యంపై బరకాలు కప్పిన దృశ్యం

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి ఎడతెగని వర్షం కురుస్తూనే ఉంది. ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకు మించడం లేదు. మే నెల ఆరంభంలో ఎండలు విపరీతంగా ఉంటాయని భావించినప్పటికీ అకాల వర్షంతో ఎండ వేడిమి నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించింది. కానీ కోతల దశలో ఉన్న వరి రైతులకు, మొక్కజొన్న రైతులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. కళ్ళాల్లోనే ధాన్యం ఉన్న నేపథ్యంలో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు ఏలూరు జిల్లా వ్యాప్తంగా 6 సెంమీ వర్షపాతం నమోదైంది. గురువారం ఉదయం నుంచి గురువారం సాయంత్రం వరకు జిల్లా వ్యాప్తంగా మరో 4 సెం.మీ వర్షపాతం నమోదు కావచ్చని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. బంగాళాఖాతంలో తుఫాను హెచ్చరికలు నేపథ్యంలో రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

పశ్చిమ గోదావరిలో

సాక్షి, భీమవరం: గురువారం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం నమోదు కాగా అక్కడక్కడా చెదురుమదురు వర్షాలు పడ్డాయి. దాళ్వా ధాన్యం తడిచి రైతులు ఇబ్బంది పడ్డారు. తాడేపల్లిగూడెంలో అత్యధికంగా 46.6 మి.మీ వర్షపాతం నమోదు కాగా ఇరగవరంలో 32.2 మి.మీ., ఆచంటలో 20 మి.మీ., పోడూరులో 19 మి.మీ., పెంటపాడులో 17 మి.మీ., తణుకులో 15 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. ఉదయం పూట ఎండ రావడంతో రైతులు తడిచిన ధాన్యాన్ని రోడ్లపైనా ఖాళీ ప్రదేశాల్లోనూ ఆరబెట్టుకుంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు రెండు రోజులుగా కోతలు నిలిపివేశారు.

బ్యాంకు లాకర్‌లో డబ్బు మాయం

మనస్తాపంతో బాధితురాలి ఆత్మహత్యాయత్నం

ఏలూరు టౌన్: బ్యాంకు లాకరులో దాచుకున్న డబ్బు మాయం కావటంతో బాధితురాలు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. బాధితురాలు ఆత్మహత్యానికి పాల్పడడంతో ఆమెను ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు శివారు కొత్తూరు ఇందిరాకాలనీకి చెందిన ఏ.రమాదేవి ఏలూరులోని డీబీఎస్ బ్యాంకులో 20 ఏళ్లుగా స్వీపర్‌గా పనిచేస్తోంది. ఆమెకు అదే బ్యాంకులో లాకర్ సదుపాయంతో ఖాతా ఉంది. తన లాకర్‌లో కొంతకాలంగా నగదు, బంగారు ఆభరణాలు దాచుకుంటోంది. మార్చి 31న రమాదేవి లాకర్ ఓపెన్ చేయగా దానిలో దాచుకున్న రూ.2 లక్షల నగదు కనిపించలేదు. బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకువెళ్ళగా వారు సీసీ పుటేజ్ పరిశీలించి అంతా బాగానే ఉందని చెప్పారు. తన డబ్బులు ఏమయ్యాయో తెలియాలని, తనకు న్యాయం చేయాలని రోజూ బ్యాంకు అధికారులను అడుగుతూ ఉన్నా వారు పట్టించుకోలేదు. మనస్తాపానికి గురైన రమాదేవి గురువారం బ్యాంకులోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సిబ్బంది వెంటనే ఆమెను ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఆ సందర్భంగా ఆమె బ్యాంకు అధికారిపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆరు నెలల కిత్రం తాను లాకర్ తెరిచే సమయంలో బ్యాంకులో పనిచేసే అధికారి విజయ్‌కుమార్ తన వెనుకనే వచ్చాడని, అతనే నగదును కాజేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఉపాధ్యాయురాలి మృతి

ఆసుపత్రిలో బంధువుల ధర్నా



మృతిచెందిన ఉపాధ్యాయురాలు పాలకూడి కృపాకుమారి(55)

జంగారెడ్డిగూడెం: వైద్యుల నిర్లక్ష్యమే ఉపాధ్యాయురాలి మృతికి కారణమంటూ మృతురాలి బంధువులు గురువారం పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిపై దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పాలకూటి కృపాకుమారి (55) జ్వరంతో బాధపడుతూ జంగారెడ్డిగూడెంలోని ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చింది. ఆమెకు ఆసుపత్రి వైద్యులు వైద్యం నిర్వహిస్తుండగా, ఆమె పరిస్థితి విషమంగా మారడంతో ఏలూరుకు రిఫర్ చేశారు. దీంతో కృపాకుమారిని అంబులెన్స్‌లో ఏలూరు తరలిస్తుండగా, మార్గమధ్యలో ఆమె మృతి చెందింది. దీంతో బంధువులు జంగారెడ్డిగూడెంలోని కృపాకుమారికి చికిత్స అందించిన ప్రైవేట్ ఆసుపత్రి వద్దకు తీసుకువచ్చి ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. వైద్యులు నిర్లక్ష్యమే కృపాకుమారి మృతికి కారణమైందని పేర్కొంటూ ఆసుపత్రి ఆవరణలోని పూల కుండీలను, కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న సీఐ పి.బాలసురేష్‌బాబు, ఎస్సై ఎం.సాగర్‌బాబులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. మృతురాలి కుటుంబసభ్యులను శాంతింపచేశారు.

ఆలయ ఉద్యోగి అరెస్టు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో దర్శనం టికెట్ల రీప్రింట్ (డబుల్ ప్రింట్)కు పాల్పడిన రికార్డ్ అసిస్టెంట్ సీహెచ్.పవన్ కుమార్‌ను బుధవారం రాత్రి అరెస్టు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. పవన్ కుమార్ రూ. 200లు దర్శనం టికెట్ల రీప్రింట్‌కు పాల్పినట్టు ఆలయ ఏఈఓ కేఎల్ఎన్ రాజు గతనెల 30న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన ఎస్సై సుధీర్ అరెస్టు చేసి, గురువారం కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్టు తెలిపారు.

విద్యుత్ శాఖలో అక్రమ కనెక్షన్లపై దర్యాప్తు

కొయ్యలగూడెం: నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చిన తమ శాఖలోని సిబ్బందిని గుర్తించి వారిపై శాఖా పరమైన చర్యలను తీసుకోవాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఏడీఈ బి.గోపాలకృష్ణ, ఏఈ ఎస్వీ రామారావులు గురువారం పేర్కొన్నారు. సాక్షి దినపత్రికలో 4వ తేదీన ప్రచురితమైన 'జూనియర్ లైన్‌మెన్ల చేతివాటం' కథనానికి స్పందించి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చిన కొయ్యలగూడెం అశోక్ నగర్‌లోని ఏరియాలో విచారణ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో పాటు అక్రమంగా కనెక్షన్లు ఇచ్చినట్లు తేలిందన్నారు. దీనిపై జంగారెడ్డిగూడెం డీఈ అంబేడ్కర్ విచారణకు ఆదేశించగా క్షేత్రస్థాయిలో చేపట్టిన విచారణలో సిబ్బంది అక్రమాలు వెలుగు చూశాయన్నారు. తుది నివేదికను డీఈకి సమర్పించామని తెలిపారు.

అకాల వర్షాలు.. కర్షకులకు కష్టాలు

- పలు గ్రామాల్లో తడిచిన వరిపంట
- ఆందోళనలో అన్నదాతలు

పెంటపాడు: అకాల వర్షాలు రైతులకు కష్టాలను తెచ్చిపెట్టాయి. ఈ ఏడాది వాతావరణం అనుకూలించింది. రబీసాగు సజావుగా సాగింది. పంట చేతికి వచ్చే తరుణంలో అకాల వర్షాలు పడటంతో రైతుల కష్టపడి పండించుకొన్న పంటకు నష్టం జరుగుతోంది. వర్షాల నుంచి పంటను కాపాడుకొనేందుకు రైతు నానా తంటాలు పడుతున్నాడు. ఈ ఏడాది నియోజకవర్గంలో 60 వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఎక్కువమంది రైతులు ఎంటీయు 1156, 1121 ప్రైవేట్ ఇతర వంగడాలను సాగు చేశారు. ప్రస్తుతం పంట కోత దశకు చేరుకొంది. పలు గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. కూలీల కొరత, పనిలో వేగం కోసం యంత్రాలతో రైతులు ఆదరాబాదరాగా మాసూళ్లు చేపట్టారు. ఇప్పటికే సుమారు 70 శాతం పంటను రైతాంగం ఒబ్బిడి చేసుకొంది. పెంటపాడు, గూడెం మండలాల్లో వరి పొలాలల్లో ధాన్యం రాశులు ఉన్నాయి. ఇంకా 30 శాతం పంట పూర్తికావాల్సి ఉంది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు ధాన్యం రాశులు తడిచిపోయాయి. కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులను రైతులు ప్లాస్టిక్ కవర్లు, బరకాలతో కప్పి కాపాడుకొంటున్నారు. బుధవారం కొద్దిగా తెరిపి ఇవ్వడంతో తడిచిన ధాన్యం రైతులు ఆరబెట్టుకుంటున్నారు. రెవిన్యూ, వ్యవసాయశాఖ అధికారులు పలు గ్రామాల్లో పర్యటించి తడిచిన వరిపంటను పరిశీలించి జాగ్రత్తలు, సూచనలు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం భారీ వర్షం పడింది. పల్లపు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొద్దిగా తెరిపి ఇచ్చి ఆకాశం మేగావృతమై ఎక్కువశాతం వర్షం కురిసింది. ముందస్తుగా వ్యవసాయశాఖ అధికారులు రైతులను అప్రమత్తం చేశారు. దీంతో నాలుగు రోజుల నుంచి కోతలు కోయక రైతులు మిన్నకుండిపోయారు. ఉన్న ధాన్యం ఒబ్బిడి చేసే పనిలో పడ్డారు. దీంతో నష్టం కొంత తగ్గినా, చేలలో వర్షం నీరు చేరింది. గురువారం కురిసిన వర్షం వల్ల పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



ప్రత్తిపాడు- అలంపురం రహదారి పై నిలిచిన వర్షం నీరు



పెంటపాడు మండలంలో వర్షానికి తడిచిన బస్తాలను తరలిస్తున్న రైతులు

మరో నాలుగు రోజులు కోతలు వాయిదా వేసుకోవాలి

వాతావరణ ప్రభావం వల్ల మరో నాలుగు రోజులు వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఆదేశాల మేరకు రైతులు అప్రమత్తంగా ఉండాలని పెంటపాడు వ్యవసాయాధికారి కె. పార్థసారధి కోరారు. గత రెండు రోజులు నుంచి ఆయన రెవిన్యూశాఖ సిబ్బంది, వీఏఏలతో కలిసి పలు గ్రామాల్లో పర్యటించారు. యంత్రాలతో కాక కూలీలతో కోసుకొన్న వరి పనలు పాడవకుండా ఉప్పుద్రావణాన్ని చల్లుకోవాలని సూచించారు. ధాన్యం రాశులపై బరకాలు కప్పి ఉంచాలని, కిందికి నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో సారధి సూచించారు. – వ్యవసాయాధికారి పార్థసారధి

మంత్రి కారుమూరిని కలిసిన పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు



తణుకులో మంత్రి కారుమూరిని కలిసిన వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల జిల్లా అధ్యక్షులు

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల జిల్లా అధ్యక్షులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ వైద్య విభాగ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలా సత్యనారాయణలు కలిసి తమ విభాగాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని మంత్రి కారుమూరికి తెలిపారు.

క్లుప్తంగా

వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు ఎంతో అవసరం



దస్తవేజుల లేఖర్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవిలో దాహార్తులకు చలివేంద్రాలు ఏర్పాటు ఎంతో అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. తాలూకా ఆఫీస్ సెంటర్‌లో గురువారం దస్తవేజుల లేఖర్ల సంఘం ఆధ్వర్యంలో గూడెం, పెంటపాడు లేఖర్లు, స్టాంపు వెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల సహాయకులు సహకారంతో చలివేంద్రం ఏర్పాటు చేశారు. సబ్ రిజిస్ట్రార్ బీవీవీ సత్యనారాయణ చలివేంద్రాన్ని ప్రారంభించారు.

బాధితుడికి కళాకారుల ఆర్థిక సాయం



బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

తణుకు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఉండ్రాజవరం గ్రామానికి చెందిన కత్తుల సురేష్ అనే బాధితుడికి ఉభయ గోదావరి జూనియర్ అండ్ డైలాగ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సాయం చేశారు. క్రైమ్ బ్రాంచి రిటైర్డ్ ఎస్సై వీవీఎస్ రాంబాబు, నిడదవోలు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ డి.శ్రీనివాస్ చేతుల మీదుగా దాతలు అందజేసిన రూ. 24,200 నగదును బాధితుడికి అందజేశారు. జూనియర్ ఆర్టిస్టు లక్ష్మి ఆదరణలో ఉన్న సురేష్‌ను పరామర్శించిన వారిలో అసోసియేషన్ మేనేజర్ అన్నదేవర శ్యాంబాబు, బొలిశెట్టి అన్నపూర్ణ, ఘంటసాల గాయకులు చివటం సుబ్బారావు, రిటైర్డ్ మున్సిపల్ మేనేజర్ పులమాల వీరభద్రం, వీరలక్ష్మి, కాపాక రామాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం



వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలకరించిన ఉత్సవ విగ్రహాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద గల శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి అత్యంత వైభవంగా వెంకటేశ్వరస్వామి వారి కల్యాణం జరిగింది. ఉదయం నుంచి ఆలయం వద్ద పూజలు జరిగాయి. ఆలయ కమిటీ ఛైర్మన్ కూనిరెడ్డి శ్రీనివాస్ విశేష పూజలను పర్యవేక్షించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

వైభవంగా పాతూరు రామాలయం విగ్రహ ప్రతిష్ఠ పూజలు



పాతూరు రామాలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పాతూరు రామాలయం విగ్రహ పునః ప్రతిష్ఠలో భాగంగా ఆలయం వద్ద మూడోవ రోజు గురువారం ఉదయం విష్ణు సహస్రనామ పారాయణం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, చక్రార్తి మండల పూజ, అగ్ని ప్రతిష్టాపన, వాస్తుహోమము, క్షీరాధివాసము, హోమాలు జరిగాయి. ఆలయ ధర్మకర్త కర్రి సీతారామయ్య, పునః నిర్మాణ కమిటీ సభ్యులు కర్రి ప్రభాకర్ బాలాజీ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. కొడవటిగంటి వెంకట నరసింహాచార్యులు బ్రహ్మత్వం వహించారు. పునః నిర్మాణ కమిటీ సభ్యులు కర్రి భాస్కరరావు, శాప్ డైరెక్టర్ కర్రి విజయలక్ష్మి తదితరులు పర్యవేక్షించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

ఒబ్బిడైన ధాన్యాన్ని విక్రయించుకోవాలి

భీమవరం అర్బన్: రెండు, మూడు రోజులో తుపాను రానుందనే వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో కల్లాల్లో ధాన్యపు రాశులు, ఆరబెట్టిన ధాన్యాన్ని ఆర్‌బీకే సెంటర్లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ద్వారా విక్రయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ రైతులకు సూచించారు. భీమవరం మండలంలోని యనమదుర్రు గ్రామంలో గురువారం రైతులకు వర్షాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సలహాలు, సూచనలు చేశారు. కల్లాల్లో ఉన్న ధాన్యపు రాశులపై టార్పాలిన్‌తో వర్షపు నీరు రాకుండా కప్పెట్టాలన్నారు. రాశులు చుట్టూ అడుగు వెడల్పుతో గొయ్యి తీసి వర్షపు నీరు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ధాన్యం తడిస్తే 100 లీటర్ల నీటిలో 5 కేజీలు ఉప్పును కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

రేపటి నుంచి పెంటపాడు గ్రామదేవతల జాతర

పెంటపాడు: మే 6 నుంచి పెంటపాడు గ్రామ దేవతలైన పెంట్లమ్మ, కొర్లపాటి వెంకాయమ్మల జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన పెంటపాడులో ఉత్సవ శోభ సంతరించుకొంది. ఏడేళ్లకు ఒకసారి నిర్వహించబోయే ఈ ఉత్సవాలు పురస్కరించుకొని గ్రామం ముస్తాబు అవుతోంది. గ్రామం అంతా వీధుల్లో విద్యుత్ కటౌట్‌లు, పందిళ్లు వెలిశాయి. పుట్టింటి ఆడపడుచులకు ఆహ్వానాలు పంపారు. ఈ ఉత్సవాలు పురస్కరించుకొని ఆలయ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ జాతర ఉత్సవాల్లో భాగంగా తొలిరోజైన శనివారం తెల్లవారు జామున పొలిమేర కట్టి అమ్మవారికి గరగ మొక్కులు, చలిమిడి పానకాలు, రాత్రి 6 గంటల నుంచి లలిత సహస్రనామపారాయణం, 9 గంటలకు అమ్మవారికి బలిచేట కార్యక్రమం, 7న ఉదయం అమ్మవారి పరగంగ సాగనంపడం, ప్రత్యేక పూజలు, అమ్మవారిని అత్తారింటికి పంపడం, పూరిగుడి పండించడం, సాయంత్రం అమ్మవారికి వార్షిక పాన్పులు, రాత్రికి సంగంమేడ వద్ద నున్న గర్భగుడి వద్ద వార్షిక మొక్కుబడుల చెల్లింపు, నైవేద్యాల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు లక్ష్మణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాలు సజావుగా సాగేలా గ్రామస్తుల సహకారం ఉండాలని కోరారు.





పెంటపాడు సంగంమేడ వద్ద కొలువైన పెంట్లమ్మ, కొర్లపాటి వెంకాయమ్మల పురాతన ఆలయాలను రంగులు వేసి ముస్తాబు చేసిన దృశ్యం, పురానత పెంట్లమ్మ అమ్మవారి విగ్రహం

జగన్ పాలనలో ఎస్సీల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ఎస్సీల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు కొనియాడారు. కడకట్లలో గురువారం మాల మహానాడు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి మాల మహానాడు నాయకులు, సభ్యులు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ ఎస్సీలకు మంత్రి పదువులు, కార్పొరేషన్ పదువుల్లో అధిక ప్రాధాన్యత ఇచ్చారని కొనియాడారు. నాడు పాదయాత్రలో ప్రజలు కష్టాలు తెలుసుకొని నేను విన్నాను, నేను ఉన్నాను, అనే నినాదంతో ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన 15 రోజుల్లోనే కోటి మంది కుటుంబాలు ప్రభుత్వం పట్ల సంతృప్తి వ్యక్తం చేయడం మాములు విషయం కాదని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగోకపోయినా ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు కె.సత్యనారాయణ, వి.సునీల్, సుందరం మాస్టారు, బి.సందీప్, బీర సునీల్ బాబు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పిస్తున్న మాల మహానాడు నాయకులు

ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

అత్తిలి: రైతులు పండించిన పంటను ప్రభుత్వమే ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తుందని, రైస్ మిల్లర్స్ కొనుగోలు చేస్తున్నారనే అపోహలు వద్దని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అత్తిలి ఏఎంసీ మార్కెట్ యార్డులో గురువారం మంత్రి కారుమూరి ఆర్బీకే సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎటువంటి సందేహాలు ఉన్నా ఆర్బీకే సెంటర్‌లలో ఇచ్చే రశీదు వెనుక ఉన్న టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి గోనె సంచుల కొరత లేదని గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి సంచులు తెప్పించి అందుబాటులో ఉంచామని చెప్పారు. రైతు నష్టపోకుండా ఉండాలనే ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ప్రభుత్వం చెల్లిస్తుందని, అది కూడా ఏ పంట నష్టం ఆ పంట సమయంలోనే సబ్సిడీ అందేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అకాల వర్షాలకు సంబంధించి నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకుంటామని చెప్పారు. ప్రతిపక్షనేత చంద్రబాబు రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ ఛైర్మన్ బుద్దరాతి భరణిప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు పైబోయిన సత్యనారాయణ, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాసు, నాయకులు కందుల సత్యనారాయణ, కంకటాల సతీష్, ఎంపీడీవో వీవీఎస్ రామారావు, ఏవో టీకే రాజేష్, గంటా నాగరాజు పాల్గొన్నారు.



అత్తిలిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి కారుమూరి

ఇంధనాన్ని పొదుపుగా వాడాలి

తణుకు అర్బన్: ఇంధనాన్ని పొదుపుగా వాడడంలో డ్రైవర్లు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.వీరయ్య చౌదరి అన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో తణుకు ఆర్టీసీ డిపోలో గురువారం నిర్వహించిన ఆయిల్ పొదుపు సక్షమ్ 2023 అనే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆయిల్‌ను పొదుపుగా వాడడం వలన సంస్థ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని అన్నారు. ఈ సందర్భంగా ఇంధన పొదుపు అంశంపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఉద్యోగులు యామిని, అసిస్టెంట్ మెకానిక్ పవన్ బహుమతులు అందుకున్నారు. అనంతరం ఏప్రిల్ నెలలో అధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు ఎ.వెంకన్నబాబు, బి.దామోదర్‌రావులకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందచేశారు. డిపో మేనేజరు పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఏరియా సేల్స్ మేనేజరు కె.వెంకటేష్, ఆయిల్ డిపో క్లర్క్ ఆలీ, ట్రాఫిక్ ఇనస్పెక్టర్ బీవీ కృష్ణారావు, సూపర్‌వైజర్లు, డిపో, గ్యారేజ్ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్‌లు పాల్గొన్నారు.



తణుకులో మాట్లాడుతున్న ప్రజా రవాణాధికారి వీరయ్యచౌదరి

రాష్ట్రానికి పట్టిన అరిష్టం చంద్రబాబు

తాడేపల్లిగూడెం అర్బన్: చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి పట్టిన అరిష్టమని తాడేపల్లిగూడెం మండల నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్ విమర్శించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తెదేపా పాలనలో రైతులకు రూ. 86వేల కోట్లు రుణమాఫీ చేస్తానని ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలేదన్నారు. దీంతో రైతులు వడ్డీతో సహా రుణాలను చెల్లించాల్సిన దౌర్భాగ్య పరిస్థితిని ఎదుర్కొన్నారన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు రైతులకు వ్యవసాయం దండగ వ్యవసాయం చేసిన రైతులెవరూ లాభపడలేదని విమర్శించిన దౌర్భాగ్య ముఖ్యమంత్రిగా పేరు గాంచాడన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుచూపుతో ఏప్రిల్ 12వతేదీన రైతు భరోసా కేంద్రాల ద్వారా దళారీ రహితంగా ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రైతుల విషయంలో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సానుకూలంగా ప్రతిస్పందించి జిల్లా కలెక్టర్, ఆర్డీఓలను అప్రమత్తం చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు చేస్తున్న మేలును అడ్డుకోవద్దని తెదేపా నాయకులకు హితవు పలికారు.

చంద్రబాబు మొసలికన్నీరు

తాడేపల్లిగూడెం అర్బన్: తెదేపా అధికారంలో ఉండగా వ్యవసాయం దండగ అన్న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇప్పుడు రైతుల పట్ల సానుభూతి చూపడం మొసలి కన్నీరు కార్చినట్లుగా ఉందని తాడేపల్లిగూడె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో చంద్రబాబు పర్యటనపై ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో నాయకులు విలేకర్ల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షానికి నష్టపోయిన రైతులను పరామర్శించే నేపంతో చంద్రబాబు రాజకీయాలు చేయడం దారుణమన్నారు. రైతులకు పంట రుణమాఫీ చేస్తానని చేతులెత్తేసిన చంద్రబాబు పాలన మర్చిపోలేదన్నారు. చంద్రబాబు పాలనలో వ్యవసాయ రంగం అధోగతి పాలయిందని గుర్తుచేశారు. వైకాపా ప్రభుత్వం రైతులను అన్నివిధాలుగా ఆదుకొనేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా రైతు భరోసా ద్వారా ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్థికంగా సహకారం అందిస్తుందన్నారు. ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు ఆర్‌డీఓ దాసిరాజు మండలాల్లో పర్యటించి రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేసేందుకు యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకుడు గుండుబోగుల నాగు, వెలిశెట్టి నరేంద్రకుమార్, మునగాల బాబ్జి, కొలుకులూరి ధర్మరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

46.6 మిల్లీ మీటర్ల వర్షం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణం, రూరల్ మండలంలో గడచిన 24 గంటల్లో 46.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వైకేవీ.అప్పారావు గురువారం తెలిపారు. పెంటపాడు మండలంలో 17.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైందన్నారు.

వేసవి సెలవులను సక్రమంగా వినియోగించుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో మే 8 సోమవారం నుంచి జూన్ 16 శుక్రవారం వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 40 రోజుల పాటు వేసవి శిక్షణా తరగతులు 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి వానపల్లి శ్రీనివాసరావు వెల్లడించారు. గ్రేడ్ -1 గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, చదవరులు సమక్షంలో జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ పిల్లలు సెలవులను సక్రమంగా వినియోగించుకోవాలని, చదివే అలవాటును పెంపొందించుకోవడం, గ్రంథాలయాన్ని సందర్శించే అలవాటు చేయడం లక్ష్యాలుగా ఉన్నాయన్నారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను శిక్షణా తరగతులకు పంపాలని విజ్ఞప్తి చేశారు.

యాత్రా స్పెషల్ బస్సులను సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు యాత్రా స్పెషల్ బస్సులను ఏర్పాటు చేశారని, భక్తులు, ప్రయాణీకులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని తాడేపల్లిగూడెం ఆర్టీసీ డీపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ బుధవారం రాత్రి అరుణాచలం గిరి ప్రదిక్షణ యాత్రా స్పెషల్ వెళ్లిందన్నారు. శ్రీ కాళహస్తీశ్వర స్వామి వారి దర్శనం, కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారి దర్శనం, శ్రీపురం శ్రీ లక్ష్మీఅమ్మవారి గోల్డెన్ టెంపుల్, అనంతరం పవిత్ర పౌర్ణమి రోజున గిరి ప్రదిక్షణ, అరుణాచలంలోని అరుణాచలేశ్వర స్వామి వారి దర్శనం జరుగుతుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో భాగంగా 6వ తేదీ ఉదయం నాటికి తాడేపల్లిగూడెం చేరుతుందని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 33/11కేవీ హౌసింగ్‌బోర్డు సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ సత్యవతినగర్ ఫీడర్, 11కేవీ రైల్వే ఫీడర్‌లో మరమ్మతులు నిమిత్తం ఈ నెల 5వ తేదీన శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. వన్‌టౌన్‌లోని వీకర్స్‌కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, కోతిబొమ్మ సెంటర్, వానపల్లిగూడెం, భూపాల్ నగర్, వెంకటరత్నం ఆసుపత్రి ఏరియా, చిట్యాల ఫంక్షన్ హాల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పాతూరులో వేంచేసియున్న పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద గురువారం రాత్రి వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం జరిగింది. దామోజీవరపు కుమార్ వెంకట నరసింహ అప్పారావు దంపతులు పీటలపై కూర్చుని స్వామి వారి వివాహం జరిపించారు. కల్యాణ కర్త వాడపల్లి మాధవాచార్యులు, అర్చకులు అగ్నిహోత్రం సుందర రామానుజాచార్యులు, తరకాచార్యులు, కిషోర్, మధులు బ్రహ్మత్వంలో స్వామివారి కల్యాణ తంతు కనులపండువగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని దేవాదాయ శాఖ సీజీఎఫ్ సభ్యులు కర్రి భాస్కరరావు, శాప్ డైరక్టర్ కర్రి విజయలక్ష్మి, ఆలయ కమిటీ ఛైర్మన్ కల్లి వెంకట నాగ శ్రీనివాస్, కమిటీ సభ్యులు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దు

పాలకోడేరు: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని అలాంటి వాటిని ప్రోత్సహించవద్దని ఆకివీడు ఐసీడీఎస్ సీడీపీఓ వాణి విజయరత్నం అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాలపై బ్రాహ్మణులు, పాస్టర్లు, ముస్లిం పెద్దలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వివాహాలపై అవగాహన లేనివారు, మంచి సంబంధం వచ్చిందని అంగీకరించే వారు ఉంటారని అటువంటివారు మిమ్మల్ని సంప్రదిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. పురోహితులు, పాస్టర్లు, ముస్లిం పెద్దలు బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బాల్య వివాహాలు చేయడానికి ప్రయత్నిస్తే సమాచారాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఇతర ప్రభుత్వ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. బాల్య వివాహాల కారణంగా బాలికలు భవిష్యతులో తీవ్ర అనారోగ్యాలకు గురికావడం, వారికి పుట్టే శిశువుల ఆరోగ్యంపై ప్రభావం పడుతుందన్నారు.